

మరణంలోనూ వీడని సోదర బంధం

ప్రజాశక్తి-ఏలేశ్వరం


అన్నదమ్ములు అప్పారావు, తాతీలు

తమ్ముడు మరణాన్ని జీర్ణించుకోలేక అన్న మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండలం గజ్జినపూడిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొండు అప్పారావు (60), తాతీలు (55) చిన్ననాటి నుంచి కలిసిమెలిసి జీవిస్తున్నారు. చిన్నవాడైన బొండు తాతీలు అనారోగ్యంతో ప్రతిపాడు ఆసుపత్రిలో మతి చెందాడు. ఇంటికి తీసుకొచ్చిన తమ్ముడి మృతదేహం చూసిన అన్న అప్పారావు అక్కడిక్కడే కుప్పకూలి పోయాడు. ఆయనకు బంధువులు పరిచర్యలు చేస్తూనే తమ్ముడు మృతదేహాన్ని శ్మశానానికి తరలించేసరికి అప్పారావు చనిపోయాడు.

పిబిసి కాల్వకు జలాలు బంద్

- గోదావరి కాల్వలో తగ్గుతున్న నీటిమట్టం
- దాళ్వాకు పొంచిన నీటిఎద్దడి


సామర్లకోట లాకుల వద్ద బాగా తగ్గిపోయిన గోదావరి జలాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట గోదావరి కాల్వ లాకుల వద్ద రోజు రోజుకూ నీటిమట్టం తగ్గిపోతోంది. దీంతో ప్రస్తుతం దాళ్వాకు సాగు నీటి ఎద్దడి పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మరోవైపు గోదావరి కాల్వలో నీటి మట్టం తగ్గిపోవడంతో రైతులు దాళ్వా పంటకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామర్లకోట లాకుల వద్ద 5 అడుగుల 5 అంగుళాలు నీటి మట్టం ఉంటే కాల్వ పరిధిలో పిఠాపురం బ్రాంచి కాల్వ, సామర్లకోట పరిధిలో ఉండూరు, మాధవపట్నం, వికె.రాయపురం, బోయినపూడి తదితర గ్రామాల పంట భూములకు సాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ప్రస్తుతం కాల్వలో 4 అడుగుల 4 అంగుళాల నీటిమట్టం ఉంది. దీంతో శివారు భూమలకు పూర్తిస్థాయిలో నీరు అందని పరిస్థితి నెలకొంది. వేసవి ఎండల నేపథ్యంలో వంతులవారీ నీటి సరఫరా ప్రారంభిస్తే మరింతగా నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. నీటి లభ్యత లేని కారణంగా పిబిసి కాల్వకు గోదావరి లాకుల వద్ద నీటి సరఫరాను గత నెల 29న సామర్లకోట వద్ద మూసివేశారు. కేవలం ఏలేరు కాల్వ నీటిపైనే మండలంలోని పలు గ్రామాలతో పాటు పిబిసి కాల్వ పరిధిలో రైతులు ఆధారపడి ఉన్నారు. పిబిసి కాల్వ పరిధిలో రైతులు ఏలేరు ప్రాజెక్టు నుంచి వచ్చే జలాలపైనే ఆధారపడి సాగు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం సామర్లకోట లాకుల వద్ద నీటి మట్టం బాగా తగ్గిపోయింది. పిబిసి స్లూయిజ్ గేటు వద్ద కూడా నీటి మట్టం తగ్గింది. ప్రస్తుతం దాళ్వా పంట వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తుండడం, వరి నారు కలుపు తీసే పరిస్థితిలో పంట ఉంది. పంట గింజ పాలు పోసుకునే దశలో నీటి కొరత ఏర్పడితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని రైతులు అంటున్నారు. కాగా ప్రభుత్వం, అధికారులు స్పందించి దాళ్వాలో సామర్లకోట గోదావరి కాల్వ, పిఠాపురం బ్రాంచి కాల్వ పరిధిలో వేలాది ఎకరాల సాగు భూమలకు సాగు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టి, తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


పూర్తిగా మూసివేసిన కాల్వకు వెళ్లే స్లూయిజ్

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం...

ఈ విషయంను జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా దృష్టికి తెచ్చాము. ఇటీవల నిర్వహించిన ఇరిగేషన్, వ్యవసాయాధికారుల మీటింగ్‌లో కలెక్టర్ మాట్లాడుతూ నీటి పరిస్థితిని బట్టి అయిదు రోజులకు ఒకసారి వంతుల వారీ విధానం ప్రవేశపెట్టమని చెప్పారు. తొలుత చివరి భూమలకు నీటి సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు.

- ఇమ్మిడిశెట్టి సత్య, మండల వ్యవసాయాధికారి

నీటి లభ్యత దృష్ట్యా నిలిపివేశాం

నీటి మట్టం లాకు ప్రాంతం వద్ద తగ్గిన అంశం రెండు రోజులు క్రితంతో పోలిస్తే ప్రస్తుతం 4 అడుగుల 5 అంగుళాల ఎత్తు ఉంది. నీటి లభ్యత దృష్ట్యా పిఠాపురం బ్రాంచి కెనాల్‌కు గోదావరి జలాలు సరఫరా పూర్తి స్థాయిలో నిలిపివేశాము. ఉన్నతాధికారులు వంతుల వారీ విధానంపై ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఆదేశాలు రాగానే ఆ ప్రకారం వంతుల వారీ విధానం అమలు చేస్తాము. నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది.

- చంటి, లాక్ సూపరింటెండెంట్, సామర్లకోట ఇరిగేషన్.


దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సిపిఎస్ రద్దు కోసం సంకల్పదీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

యుటిఎఫ్ ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు కోరుతూ కృష్ణా జిల్లా గన్నవరంలో తలపెట్టిన సంకల్ప సభను భగ్నం చేసినందుకు నిరసనగా కాకినాడ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద ఆదివారం సంకల్ప దీక్ష చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు దీక్షను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. సిపిఎస్ రద్దు తప్ప మరో ప్రత్యామ్నాయానికి ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో జిపిఎస్ ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆ ప్రయత్నాలు ఆపకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెవివి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ దేశంలో ఇప్పటికే 5 రాష్ట్రాలు సిపియస్ రద్దు చేసి పాత పెన్షన్ ఏ విధంగా అమలు చేశాయో అదేవిధంగా ఒపిఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిపిఎస్ విధానం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని తెలిపారు. ఈ సమావేశంలో కోశాధికారి పివిఎన్.గణేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షురాలు బి.నాగమణి, జిల్లా కార్యదర్శులు ఎంవి.సాయిరాం, ఎస్.వీరబాబు, సిహెచ్. సూరిబాబు, కె.పెద్దిరాజు, జి.నాగరాజు, వి.మహేష్, వి.చంద్రశేఖర్, టి.సీతారామయ్య, కనక దుర్గాదేవి, ఎన్.గోవిందరాజులు, గిరిధర్ గోపాలరావు, టి.సత్తిబాబు, 300 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరాటే ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్


పోటీలను ప్రారంభిస్తున్న రామారావు

స్థానిక శుభం కాపు కళ్యాణ మండపంలో రియాన్ ఆర్‌యు షోటోఖాన్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో రెండో ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. రాష్ట్ర టెన్నికాయిట్ సంఘం అధ్యక్షులు వైడి.రామారావు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే అనేది యుద్ధకళ మాత్రమే కాదని, ఇది మొత్తం శరీర ఆరోగ్యాన్ని పెంపొందించడంతోపాటు శ్రేయస్సును ప్రభావితం చేసే జీవనశైలి అన్నారు. కరాటే శిక్షణ వల్ల ఆత్మ రక్షణతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. బాల్య దశ నుంచి కరాటే శిక్షణ వల్ల భవిష్యత్తులో ఎటువంటి దీర్ఘకాలిక రోగాలు దరిచేరవని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కరాటే పోటీలు నిర్వహిస్తున్న కరాటే మాస్టర్ ఎల్.సూర్య అభినందనీయులని రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బి.వెంకటేశ్వరరావు, కేతా శ్రీను, ట్రాఫిక్ ఎస్ఐ విజయబాబు పాల్గొన్నారు.

14 నుంచి విశాఖ ప్యాసింజర్ రైలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కరోనా సమయంలో నిలిపివేసిన రాజమహేంద్రవరం- విశాఖ ప్యాసింజర్ రైలును సుదీర్ఘ విరామం అనంతరం ఈ నెల 14న పునః ప్రారంభించనున్నారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే అధికారులకు ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చారు. గతంలో 67295-67296 నెంబర్లతో నడిచిన రైలును ఇకపై 07466-07467 నెంబర్లతో నడపనున్నారు. అన్ రిజర్వ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఛార్జీలను వసూలు చేస్తారు. ఈ రైలు రాజమండ్రిలో ఈనెల 14న ఉదయం 9.20 గంటలకు బయల్దేరుతుంది. ఈ రైలును తిరిగి నడపడం పట్ల సామాన్య ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంచి అలవాట్లతో కేన్సర్ నివారణ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

నేటి వేగవంతమైన జీవన విధానంలో రోజురోజుకీ కేన్సర్ రోగుల సంఖ్య పెరగడం బాధాకరమని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో ఐడిఎ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐడిఎ కాకినాడ శాఖ అధ్యక్షులు డాక్టర్ వెదురుపాక సతీష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిశుభ్ర వాతావరణం, కాలుష్యం, పొగ తాగడం, నాణ్యమైన ఆహారం తీసుకోకపోవడం వల్ల క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక స్థాయిలో దీన్ని గుర్తిస్తే అన్ని రకాల క్యాన్సర్లనూ సమర్థవంతమైన చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరు పండ్లు, కూరగాయలను అధికంగా తీసుకోవాలని రోజు అరగంటసేపు వ్యాయామం చేయాలన్నారు. బరువు పెరగరాదని, పొగ తాగరాదని, ప్రాసెస్ చేసిన మాంసాహారాలను తీసుకోరాదన్నారు. కాకినాడ శాఖ అధ్యక్షులు డాక్టర్ సతీష్ మాట్లాడుతూ కేన్సర్ నివారణకు ఐడిఎ ఆధ్వర్యంలో రోజుకొక ప్రాంతంలో పోస్టర్లను ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ధూమపానంతో క్యాన్సర్ బారిన పడిన వ్యక్తి తాను పడుతున్న బాధలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుమార్ యాదవ్, అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, పార్థసారథి, రాఘవరావు, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

కోటనందూరులో నేడు స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల మొదటి సోమవారం 6న జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపన స్వీకరణ కార్యక్రమాన్ని కోటనందూరు, ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని ఆమె కోరారు.

వైద్య శిబిరం పునరుద్ధరణ అభినందనీయం

ప్రజాశక్తి-సామర్లకోట


సత్కరిస్తున్న సభ్యులు

స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన వైద్య శిబిరాన్ని పునరుద్ధరించిడం అభినందనీయమని వాకర్స్ సభ్యులు విప్పర్తి కొండలరావు అన్నారు. ఆదివారం మెడికల్ క్యాంప్ నిర్వాహకులైన సైపుల్లా, వారిస్, జి.సతీష్‌ను వాకర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ గ్రౌండ్లో కరోనాకు ముందు వైద్య శిబిరం నిర్వహించే వారని, కరోనా రావడంతో వైద్య శిబిరం ఆగిపోయందని చెప్పారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ బిపి, సుగర్ వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో సైపుల్లా, వారిస్ ముందుకు వచ్చి హెల్త్ చెకప్‌కు అవసరమైన పరికరాలను స్పాన్సర్ చేసి మెడికల్ క్యాంపును పున్ణ ప్రారంభించడం అభినందనీయ మన్నారు. ప్రతినెలా మొదటి ఆదివారం 200 మందికి బిపి, సుగరు, బరువు చెకప్ చేస్తారని చెప్పారు. ఈ క్యాంప్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు థామస్, మద్దాల వెంకన్న, ఎల్.శివప్రసాద్, గుండు బాబ్జి, ఎస్.శ్రీనివాస్, ఇ.రవి, కెనడీ, బులిరాజు, జిలాని, నాయుడు, కె.శ్రీనివాస్, వాసు, వెంకట్, మెకానిక్ శ్రీనివాస్, కోటి, చింటూ పాల్గొన్నారు.

పిబిసి కాల్వలో గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్


గుర్రపు డెక్క తొలగిస్తున్న సిబ్బంది

సామర్లకోట అయిదు తూముల నుంచి పిఠాపురం బ్రాంచి కాల్వలో గుర్రపు డెక్క తొలగించే పనులు జోరుగా నిర్వహిస్తున్నారు. సామర్లకోట అయిదు తూముల వద్ద ఉన్న శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం హరిహరక్షేత్రం వద్ద నుంచి పిబిసి కాల్వలో గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. ప్రస్తుతం సామర్లకోట గోదావరి కాల్వ నుండి పిబిసి కాల్వకు గోదావరి జలాల సరఫరాను గత నెల 29 నుండి నిలుపుదల చేశారు. కేవలం ఏలేరు జలాలపైనే పిబిసి రైతులు ఆధారపడి దాళ్వా పంటను సాగు చేస్తున్నారు. సామర్లకోట పెద్ద ఏటి వంతెన వద్ద పిబిసి జలాల నిల్వ 2 అడుగల 2 అంగుళాల నీటిమట్టం నిల్వ ఉంది. ఈ కాల్వ ద్వారా మండలంలోని చంద్రంపాలెం, పి.వేమవరం, గొంచాల, నవర, కాపవరం తదితర గ్రామాల భూములకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతానికి ఎటువంటి నీటి సమస్య లేదని, నీటి మట్టం తగ్గితే ఈ కాల్వ పరిధిలో శివారు భూమలకు నీటి ఎద్దడి తప్పదని పిబిసి కాల్వ పరిధిలో రైతులు అందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ మిషన్, 8 మంది కూలీలతో కాల్వలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు. ప్రస్తుతం చంద్రంపాలెం వరకూ పనులు జరగుతున్నాయి. సామర్లకోట నుంచి ఎకె మల్లవరం వరకూ పిఠాపురం బ్రాంచి కాల్వలో గుర్రపు డెక్కను తొలగించాల్సి ఉంది.


అన్నదానంలో పాల్గొన్న ఎంఎల్ఎ

భావన్నారాయణ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సర్పవరంలోని శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో ఛైర్మన్ పుల్ల నారాయణరావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకర్‌రావు, పుల్ల చందు ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నదారం ఏర్పాటు చేశారు. ఈ అన్నదానంలో ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కన్నబాబు, ఆయన సతీమణి శ్రీవిద్య, కుమార్తె సిరి, కురసాల సత్యనారాయణ, డైరెక్టర్ కల్యాణ్ కృష్ణ అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్యామలాదేవి వీరభద్ర రాజు, పుల్ల వీర వెంకట సత్యనారాయణ, ఘంటసాల బద్రీనాథ్, వాసంశెట్టి లక్ష్మీశ్రీను, పులగల మరిడమ్మ, శీలం అప్పారావు, ఇఒ కె.విజయలక్ష్మి సురేంద్ర, రాఘవమ్మ ట్రస్ట్ అధినేత మాగాపు వెంకటరమణ, నాని పాల్గొన్నారు.

కడవరకూ కార్యకర్తలతోనే...

ప్రజాశక్తి-కోటనందూరు


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణుడు

చివరి రక్తపు బొట్టు ఉన్నంతవరకు టిడిపి తుని నియోజకవర్గ కార్యకర్తల శ్రేయస్సు కోసం పని చేస్తానని యనమల కృష్ణుడు అన్నారు. పార్టీ తుని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా తనను కాదని యనమల రామకష్ణుడు కుమార్తె యనమల దివ్యకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడంపై ఆయన స్పందించారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినంత మాత్రాన ఎంఎల్ఎ టికెట్ ఇచ్చినట్లుగా భావించాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తల శ్రేయస్సు కోసం మూడు దశాబ్దాల కాలం నుంచి శ్రమ పడుతున్నానని, కార్యకర్తలంతా తన వెంటే ఉన్నారని చెప్పారు. ఈ నెల 19న చంద్రబాబు జగ్గంపేట వస్తారని అప్పుడు చంద్రబాబుతో మాట్లాడి పరిస్థితులను వివరిస్తానని అన్నారు. కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని అన్నారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని వివేకానంద్ పార్కులో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ పుస్తక ప్రదర్శనలో బాలలకు ఉపయోగపడే అనేక నీతి కథల పుస్తకాలను ప్రదర్శనగా ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాకినాడ నగరంలోని పాఠశాలల నుంచి విద్యార్థులు వచ్చి పుస్తక ప్రదర్శనలు ఉంచిన పుస్తకాలను చూశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడారు.

నూకాలమ్మను దర్శించుకున్న దొరబాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

కాండ్రకోట గ్రామంలోని నూకాలమ్మ అమ్మవారిని ఆదివారం హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు దర్శించుకున్నారు. నాగ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, దేవస్థానం ఛైర్మన్ గవరసాన వీరాస్వామి, ఆలయ ఇఒ టివి.సూర్య నారాయణ, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నానాజీ, జెడ్‌పిటిసి జాగు వీరభద్రరావు, సొసైటీ ఛైర్మన్ పళ్ల గంగారావు, గవరసాన రాజశేఖర్ పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



'టిడిపి ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి -పెద్దాపురం, సామర్లకోట రూరల్


పెద్దాపురంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధిస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం పెద్దాపురం మండలం పులిమేరులో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. ఒక పక్క పన్నుల భారాలు, మరోపక్క నిత్యవసర వస్తువుల ధరలు సామాన్య మధ్య తరగతి ప్రజానీకాన్ని అవస్థలపాలు చేస్తున్నాయన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్ర స్థాయిలో ఉందని, కొత్త పరిశ్రమల రాక, కొత్త ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. ఈ తరుణంలో ప్రజలందరూ రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మల నాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), మాజీ ఎంపిపి గుడాల రమేష్, ఎలిశెట్టి నాని, మొయిళ్ల కృష్ణమూర్తి, చాగంటి గోపాలకృష్ణ, కంటి బోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సామర్లకోట రూరల్ మండలం వేట్లపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ చినరాజప్ప పాల్గొన్నారు. మాజీ ఎంపిపి కొండపల్లి క బుష్ణమూర్తి, పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనివాసు, గుమ్మళ్ల రామకృష్ణ, రాజు, సత్యనారాయణ, అడబాల కుమారస్వామి, అడబాల శ్రీహరి, రాయవరపు కృష్ణారావు, బలుసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాధవపట్నం వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం

సామర్లకోట రూరల్ : మాధవపట్నం వద్ద వున్న సర్పవరం రైల్వే గేటు వద్ద ఆదివారం గేటు దాటుతుండగా గడ్డి ట్రాక్టర్ వెనక పగ్గంతాడులు ఒక్కసారిగా తెగిపోయింది. దీంతో ట్రాక్టర్‌పై నుండి గడ్డి జారిపడింది. ట్రాక్టర్ నుండి గడ్డి ఒక్కసారిగా జారిపడడంతో రైల్వే ట్రాక్‌పై వాహనాలు ఒక్కసారిగా ఆగిపోయాయి. డ్రైవర్ ట్రాక్టర్‌ను నెమ్మదిగా ముందుకు తరలించడంతో ట్రాఫిక్‌లో వాహనాలు చిక్కుకుపోయాయి. సుమారు 20 నిమిషాలపాటు వాహనాన్ని కాకినాడ మెయిన్ రోడ్డులోకి నెమ్మదిగా గడ్డిని పారబోసుకొంటూ తీసుకెళ్ళాడు. దీంతో కాకినాడ రోడ్డులో సామర్లకోట వైపు కిలోమీటర మేర, కాకినాడ వైపు కిలోమీటరు మేర వాహనాలు బారులు తీరాయి.

ఘనంగా ఉప్పలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి,- కరప


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కన్నబాబు

కరపలోలోని ఉప్పలమ్మ అమ్మవారి ఆలయం పునఃనిర్మాణం, విగ్రహం పున్ణప్రతిష్టాపన, ప్రారంభోత్సవంలో ఎంపీ వంగా గీత, రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు దంపతులు ఆదివారం పాల్గొన్నారు. అనంతరం దేవాదాయ శాఖ నుంచి మంజూరైన రూ.40 లక్షలతో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణా శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. జనసేన రాష్ట్ర నాయకులు పంతం నానాజీ, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి దంపతులు, సినీ దర్శకుడు కురసాల కళ్యాణ్ కృష్ణ, వైసిపి సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు.


రాజేష్‌ను సన్మానిస్తున్న సభ్యులు

రాజేష్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇటీవల పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరిగిన 57వ జాతీయ స్థాయి పోటీల్లో 65 కేజీల విభాగంలో మిస్టర్ ఇండియాగా బంగారు పతకం సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన దేపాటి రాజేష్‌ను మన ఊరు - మన బాధ్యత సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మేడపాటి నాని, కె.సునీల్, భాస్కర్, ఏసు, వంశీ, భాను, ప్రకాష్, రాజేష్, రవి, చిన్న, వీరరాఘవులు పాల్గొన్నారు.

కారు ట్యాంక్ పేలి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

మండల కేంద్రమైన గండేపల్లిలోని బ్రహ్మంగారి గుడి సమీపంలో కారును పాత ఇనుప సామాన్లకు గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తుండగా ట్యాంక్‌లో కొద్దిపాటి డీజిల్ ఉండటంవల్ల ఒక్కసారిగా పేలింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో గండేపల్లి గ్రామానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన నల్లే శివ, దాసరి స్వామి, షేక్ బాషా గాయపడ్డారు. కాలం చెల్లిన కారును బ్రహ్మంగారి గుడి సమీపంలో గ్యాస్ కట్టర్‌తో విడదీస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. గాయపడిన వారిని సమీప ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

12వ పిఆర్‌సి అమలుకు డిమాండ్

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో ఉన్న 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, కార్మికులకు 12వ వేతన సవరణ అమలు చేయాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయి శ్రీనివాస్, కార్యదర్శి హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌టియు భవన్‌లో జిల్లా అధ్యక్షుడు కె.కాశీ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ బకాయిలు, కరువుభత్యం, భవిష్యనిధి, జీవిత బీమా చెల్లింపు బకాయిలు, సంపాదిత సెలవు, మెడికల్ బిల్లులు చెల్లింపులు తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి 2004 నుంచి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దొరబాబు, వెంకటరావు, నాయుడు, కెవి.శేఖర్, పాల్గొన్నారు.

విశ్వనాథ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-సామర్లకోట

సినిమా దర్శకుడు కె.విశ్వనాథ్ మృతికి ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద రింగ్ సెంటర్లో ఆయనకు నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్ట్ అడపా వెంకట్రావు మాట్లాడుతూ విశ్వనాథ్ సినీ పరిశ్రమకు చేసిన సేవలను వివరించారు. సినీ పరిశ్రమ ఉన్నంతవరకు ఆయన చరిత్రలో గుర్తుండి పోతారన్నారు. మన దేశ సాంస్కృతి సాంప్రదాయాలను తన సినిమాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన మహా వ్యక్తి విశ్వనాథ్ అని కొనియాడారు. ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, తోటకూర సాయి రామకష్ణ, బడుగు సీతారామరాజు, గిడుతూరి శ్రీనివాసరావు, జి.రాజు మాస్టారు, న్యాయవాది కొర్లమండ వీరభద్రరావు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

పట్టు పరిశ్రమ అధికారి రాజు



ముఖాముఖి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మల్బరీ తోటల పెంపకానికి పట్టు పరిశ్రమ ద్వారా రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని పట్టు పరిశ్రమ జిల్లా అధికారి బుద్దరాజు మోహన వెంకట రామరాజు అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. పట్టు పరిశ్రమ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీలు, ఇన్పుట్ సబ్సిడీలు తదితర అంశాలను ఆయన ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

జిల్లాలో ఎంత సాగు ఎక్కడెక్కడ జరుగుతుంది?

జిల్లాలో మెట్ట మండలాలైన గొల్లప్రోలు, తుని, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, రంగంపేట, పెద్దాపురం, పిఠాపురం, ఏలేశ్వరం మండలాల్లో మల్బరీ తోటల సాగు జరుగుతోంది. దాదాపు 2,500 ఎకరాల్లో సుమారు 1015 మంది రైతులు వీటిని సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కకూన్ మార్కెట్ ఉంది. ప్రతి నెలా ఆదాయం వచ్చే సాగు కాబట్టి రైతులు మరింతగా అవగాహన పెంచుకోవాలి.

ప్రభుత్వం ఏయే పథకాలు అమలు చేస్తోంది.?

పట్టు పురుగుల పెంపకం, పట్టు పురుగుల షెడ్డు నిర్మించుకునేందుకు ప్రభుత్వం వివిధాల రాయితీలు ఇస్తోంది. ఎకరం యూనిట్ విలువ రూ.25 వేలు కాగా 75 శాతం సబ్సిడీ అంటే రూ.18,750 వేలు రాయితీ ఇస్తోంది. ఎస్సీలకు 90 శాతం వరకూ రాయితీ లభిస్తోంది. పట్టు పురుగుల షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కో రైతుకి రూ.4 లక్షలు ఆర్థిక సహాయం చేస్తోంది. ఎస్సీ రైతులకు 90 శాతం, ఇతరులకు 75 శాతం రాయితీ వస్తోంది. పట్టు పరిశ్రమకు అవసరమైన సబ్సిడీ ప్రభుత్వం ఇస్తోంది. ఇందులో సైతం ఎస్సీ రైతులకు 90 శాతం, ఇతరులకు 75 శాతం రాయితీ వస్తుంది. ఇన్పుట్ రాయితీల్లో భాగంగా పట్టు గూళ్లకు 50 శాతం రాయితీ లభిస్తోంది. తెల్ల గూళ్లకు కిలోకి రూ.50 ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎన్ని కిలోలకైనా ఇన్సెంటివ్ లభిస్తుంది.

'ఉపాధి' హామీ నిధులతో ప్రయోజనాలు ఏమైనా ఉన్నాయా.?


పట్టు పరిశ్రమను మరింత ప్రోత్సహించేందుకు వీలుగా ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు కేటాయిస్తోంది. తద్వారా జిల్లాలోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతోంది. గరిష్టంగా 2 ఎకరాల్లో ఎకరాకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.63 వేలు, ఇందులో పట్టు పరిశ్రమ ద్వారా సబ్సిడీ రూ.18,750 వస్తోంది. గరిష్టంగా 5 ఎకరాల వరకూ ఇస్తాము. ఉపాధి హామీ పథకంలో మల్బరీ తోటలు పెంపకంలో భాగంగా సబ్సిడీలను అందిస్తోంది. 2 ఎకరాలు ఉన్న రైతుకు ఈ మొత్తాన్ని మూడేళ్ల పాటు ఇస్తారు. సన్న, చిన్నకారు రైతులకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది.

షెడ్ల నిర్మాణానికి ఎటువంటి సహాయం అందుతుందో తెలియజేయండి.?

ట్రైప్1లో నిర్మించనున్న రెయిలింగ్ షెడ్లకు 75 శాతం సబ్సిడీ అంటే రూ.3 లక్షలు ఇస్తున్నారు. ట్రైప్ 2లో రూ.2.25 లక్షలు సబ్సిడీ వస్తుంది. ఉపాధి పథకం నుంచి రూ.3 లక్షలు వస్తుంది.

పట్టు ఉత్పత్తిలో జిల్లా ఎన్నో స్థానంలో ఉంది.?

పట్టు ఉత్పత్తిలో రాష్ట్రంలో అనంతపురం, చిత్తూరు జిల్లాల తర్వాత కాకినాడ జిల్లా మూడో స్థానంలో ఉంది. తెల్ల గూళ్ల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్నాం. ఫ్యాషన్ టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో పట్టు వాడకానికి ప్రజలు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. దేశంలో పట్టు ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తోంది. పట్టు ఉత్పత్తి, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కలిగిస్తున్నాము.


వైసిపిలో చేరిన వారితో ఎంఎల్‌ఎ పర్వత

200 మంది వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని గిడజాం గ్రామానికి చెందిన బీర రామ్మోహన్ ఆధ్వర్యంలో 200 మంది కార్యకర్తలు ప్రతిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ సమక్షంలో ఆదివారం వైసిపిలో చేరారు. వైసిపి కండువాలు వేసి ఎంఎల్ఎ వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పర్వత మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శ్రీను, వైస్ ఎంపిపి సూర్రెడ్డి తిరుమల రాయలు, స్థానిక నేతలు అగ్ని వెంకటరమణ తదితరులు ఉన్నారు.

సముద్ర తీరంలో పోటెత్తిన జనం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడ సముద్ర తీరంలో పిఠాపురం కుంతీ మాధవ స్వామికి ఆదివారం చక్రస్నానం నిర్వహించారు. అనంతరం సముద్రంలో స్నానాలు ఆచరించేందుకు తీరానికి భారీగా జనం చేరుకున్నారు. ఆదివారం వేకువ జామునే కుంతీ మాధవ స్వామిని ఊరేగింపుగా కొండేవరం, వాకతిప్ప, కొత్తపల్లి మీదగా ఉప్పాడ సముద్రతీరానికి తీసుకువచ్చారు. కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు..

అన్నదానానికి రూ.10,116 విరాళం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయంలో అన్నదానం నిమిత్తం ఆదివారం పిఠాపురం పట్టణానికి చెందిన ఊటా రాము రూ.10,116 విరాళంగా ఆలయ ఇఒ పులి నారాయణమూర్తికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ప్రజా ప్రతినిధులు,స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న పిఠాపురం జడ్జి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని ఆదివారం పిఠాపురం జడ్జి శ్రీదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సి.హెచ్.రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో వేద పండితులు హరి గోపాల శర్మ, వెంకట శాస్త్రి, పవి ప్రకాష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు.


రాళ్ల లోడుతో వెళుతున్న లారీలు

ప్రమాదకరంగా లోడు లారీలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

అమీనాబాద్‌లో హార్బర్ నిర్మాణానికి రాళ్లు తరలిస్తున్న లారీలు ప్రమాదకరంగా ప్రయాణిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హార్బర్‌కు ఇటీవల భారీ నుంచి అతి భారీ స్థాయిలో లారీలపై పెద్ద పెద్ద రాళ్లు తీసుకువెళుతున్నారు. హార్బర్ నిర్మాణ సమీపంలో సముద్రాన్ని నింపేందుకు ఈ రాళ్లు కొన్ని రోజులుగా తీసుకెళుతున్నారు. పరిమితికి మించి సుమారు 60 టన్నుల పైబడి తీసుకువెళుతున్నారు. రోడ్లన్నీ ఎక్కడికక్కడ పాడైపోవడంతో లారీ నుంచి రాళ్లు కింద జారితే ప్రాణాలు గాల్లోకి పోతాయని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

అగ్నికి ఆహుతైన మహా వృక్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం దివిలి గ్రామ ప్రధాన రహదారిలో శనివారం రాత్రి చెట్టు తొర్రలో నిప్పు రాజుకుని మంటలు చెట్టుకొమ్మలకు వ్యాపించాయి.ఈ వార్త తెలిసిన వెంటనే పెద్దాపురం అగ్నిమాపక సిబ్బంది చెట్టును పూర్తిగా ఆర్పేందుకు,ఈ మంటలు సమీపంలోని ఇళ్లపైకి విస్తరించకుండా గంటల తరబడి కషి చేసి మంటలను ఆర్పి వేశారు.ఆదివారం మధ్యాహ్నం కాలిపోయిన మహా వక్షం నేలమట్టమయింది.ఈ నిద్ర గన్నేరు చెట్టుకు వంద సంవత్సరాల పైగా వయసు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.ఆదివారం ఈ వక్షం దగ్ధమైన ప్రాంతాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన చెట్టు తొర్రలు డొల్లలు గా మారి ప్రమాదంగా పరిణమించిన చెట్లను గుర్తించి వాటి వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాల శాఖ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి) పాల్గొన్నారు.


విగ్రహం తొలగిస్తున్న సిబ్బంది

ఏలేశ్వరంలో వైఎస్ఆర్ విగ్రహం తొలగింపు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో ప్రధాన దారులు విస్తరణ, డ్రైనేజీలు నిర్మాణం నిమిత్తం ఆక్రమణల తొలగింపులో భాగంగా అధికారులు బాలాజీ చౌక్ సెంటర్‌లోని వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని తొలగించారు. శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సమక్షంలో ఆక్రమణదారుల సమావేశం నిర్వహించిన అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఆక్రమణల తొలగింపులో ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు, ఆక్రమణల తొలగింపులో ఎవరికి మినహాయింపు లేదని సంకేతాలు ఇచ్చేందుకే వైఎస్ విగ్రహాన్ని సైతం తొలగిస్తున్నారని పలువురు భావిస్తున్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

125 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె. గంగవరం మండలంలోని శివల గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఊచిత వైద్య శిబిరం లో125 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.వైద్య శిబిరాన్ని వైసిపి నాయకులు ఇళ్ళ సూర్యనారాయణ ప్రారంభించారు. గ్రామం లోని అరుణా క్లినిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్య క్రమం లో శలా దుర్గా ప్రసాద్. సత్య నారాయణ, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు. శివల, యర్రపోతవరం గ్రామాల నుంచి ప్రజలు హాజరయ్యారు.


సమావేశంలో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

'మొబైల్ షాప్' కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణం లోని మొబైల్ షాప్ యూనియన్ నూతన కార్య వర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు కంచుమర్తి బాబురావు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొబైల్ షాప్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా గంగరాజు వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ గా మేడపాటి భార్గవ్ రెడ్డి , సెక్రటరీగా పెరుమాళ్ల శ్రీ రాజా. జాయింట్ సెక్రెటరీ ద్వారంపూడి వెంకటరెడ్డి, ట్రెజరర్ తేలు సూర్య నాగేశ్వరరావు, సభ్యులు కర్రి నాగరాజు,పెదపాటి త్రినాథ్, కల్లూరి భాస్కరరావు, పసల సురేష్, పోతబత్తుల రాము, మేడిశెట్టి వెంకట దుర్గాప్రసాద్, ముఖ్య సలహాదారులుగా రాయుడు దేవి ప్రసాద్, మన్ని వీరభద్ర రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ ప్రముఖులు అభినందించారు.

వైద్యం అందక రోగుల ఇబ్బందులు

ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సెలవు?
నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-మండపేట

పట్టణ ప్రజలకు వైద్యం మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యం సదుపాయాలు అందకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, రోగులకు వైద్యసేవలందించడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం తదితర కారణాల నేపథ్యంలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు.మండపేట పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం చెంతనే ఒకటి, స్థానిక గొల్లపుంత కాలనీలోని టిడ్కో ఇళ్ల సముదాయంలో మరొకటి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. దళితపేటలోని ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎల్‌జియస్ ఉన్నారు. ఈ ఆసుపత్రికి సుమారుగా నెలకు 70 నుంచి 100 మంది బిపి, 80 నుంచి 100 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు వస్తుంటారు. వీరికి హెచ్‌బి, షుగర్, తదితర 8 రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాల్సి ఉంటుంది. ఈ కేంద్రాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యసేవలు అందించాల్సి ఉండగా ఇక్కడి పనిచేసే సిబ్బంది దూర ప్రాంతాల నుంచి వస్తుండటంతో సమయపాలన పాటించడంలేదని పలువురు చెబుతున్నారు. మిగిలిన రోజుల్లో ఎలా ఉన్నా సెలవు, ఆదివారాల్లో కేంద్రానికి మధ్యాహ్నానికే తాళం వేస్తున్నారని రోగులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో కేంద్రాన్ని తెరచి తిరిగి 11 గంటలకే తాళం వేసినట్లు ప్రజలు చెబుతున్నారు. ఇంటి దగ్గరలోనే ఆసుపత్రి ఉన్న వైద్య సేవలు పొందేందుకు సుమారు కిలో మీటరు దూరంలో ఉన్న ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి వెళ్ళాల్సి వస్తుందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



వైద్యం వచ్చిన ప్రజలు, (ఇన్‌సెట్)లో తాళం వేసిన దళితపేటలో పట్టణ పిహెచ్‌సి

పట్టించుకోని ఉన్నతాధికారులు

సిబ్బంది సమయపాలన పాటించడంలేదని తెలిసిన ఉన్నతాధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తుండంతో వైద్యం సాయం అందడంలేదని రోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమయపాలనతో కూడిన వైద్యసేవలు అందించాలని వారు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి దుర్గారావుదొరను వివరణ కోరగా అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎవరికి కష్టం వచ్చినా స్పందిస్తాం...

రాంబాబు కుటుంబానికి రూ.5 లక్షల సాయం

వైసిపి యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం నియోజకవర్గంలో ఏ కుటుంబానికి కష్టమొచ్చినా ముందుగా స్పందించేది, సాయం అందించేది జక్కంపూడి కుటుంబమేనని వైసిపి యువజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్ అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరంవద్ద కాలువ తవ్వకం పనుల్లో మట్టి పెళ్లలు మీదపడి మతిచెందిన రాంబాబు కుటుంబానికి రూ.5లక్షల చెక్కును గణేష్ ఆదివారం అందించారు. రాంబాబు తల్లికి ప్రత్యేకంగా మరో రూ.లక్ష చెక్కు అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. రాంబాబు లేని లోటు ఆ కుటుంబానికి తీరనిదన్నారు. సంఘటన తెలిసిన వెంటనే సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టరుతో సంప్రదించామని, రాంబాబు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నామన్నారు. రాంబాబు ఇద్దరు పిల్లల చదువుకు సంబంధించి పూర్తి సహకారం అందిస్తామన్నారు. భవిష్యత్తులో రాంబాబు కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని ప్రకటించారు.


చెక్కును అందిస్తున్న గణేష్

లోకేష్ యాత్రతో వైసిపికి ఓటమి భయం

ప్రజాశక్తి-రావులపాలెం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసిన వైసిపి నేతలకు ఓటమి భయం పట్టుకుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కొత్తపేట మాజీ ఎమ్ఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఊబలంక గ్రామంలో జరిగిన పార్టీ బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జిలు, గ్రామ పార్టీ నాయకులు సమావేశానికి సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లోకేష్ పాదయాత్రను అడ్డుకుని పార్టీ కార్యకర్తలపై దాడులు చేసిన వారిపై కాకుండా టిడిపి కార్యకర్తల పైన హత్యాయత్నం కేసులు పెట్టడం, నిబంధనల పేరుతో లోకేష్, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, పులవర్తి నాని, ఎమ్ఎల్‌సి దీపక్ రెడ్డిపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, గ్రామ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎంఎల్ఎ జ్యోతుల

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని కృష్ణునిపాలెంలో సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, జోగేశ్వరావు దంపతుల ఆధ్వర్యంలో పోలవరం పునరావాస కాలనీలో రామాలయం గుడి వద్ద ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. ఎంఎల్ఎ చంటిబాబు మాట్లాడుతూ పోలవరం పునరావాస కాలనీలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, ఎంపిపి తోట రవి, బండారు రాజా, కందుల బాబ్జి, గోకవరం మండల సచివాలయంల కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు వైసిపి నాయకులు సుంకర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - చాగల్లు

చంద్రవరం శాఖ గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పుస్తకాల ప్రదర్శన ఆకట్టుకుంది. బాల సాహిత్యం పుస్తకాలను పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. బొమ్మలతో కూడిన రామాయణం, భారతం, బొమ్మరిల్లు కథలు, అక్బర్ బీర్బల్ కథలు, ఆలీబాబా 40 దొంగలు, భాగవత కథలు, తెనాలి రామకృష్ణ కథలు, అరేబియన్ నైట్స్, పిల్లల హాస్య కథలు వంటి పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. నెలలో మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని లైబ్రేరియన్ కె.సుమన్‌కుమార్ తెలిపారు. అలాగే ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ మహిళ పేర అన్నదానం

మానవత్వం చాటుకున్న ఎస్ఐ రామారావు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అనాథ మహిళ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడమే కాకుండా, ఆమె పేరుతో అన్నదానం నిర్వహించి మానవత్వం చాటుకున్నారు ఉండ్రాజవరం ఎస్ఐ కె.రామారావు. మార్కెట్ రహదారిలో నివాసం ఉండే తాతబత్తుల గాయత్రి(80) జనవరి 25న మతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న వార్డు మెంబర్ కల్పన, ఆమె భర్త కష్ణ, మాచినేని మధు, పిప్పర్ల వరప్రసాద్ స్థానిక ఎస్ఐకు తెలియజేశారు. స్పందించిన ఎస్ఐ ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె పేరుతో ఆదివారం 100 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. స్థానికులు, గ్రామస్తులు రామారావును అభినందించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మట్టా సుబ్బారావు ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ గోడ పత్రిక, చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుచుదాం పేర ముద్రించిన కరపత్రికలతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలన్నారు. జిల్లా కార్యదర్శి జనుకూటి రవికుమార్, కాంగ్రెస్ కొవ్వూరు మండల అధ్యక్షులు సాకే పుల్లారావు, చాగల్లు మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు జి.భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతరలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల అమ్మవార్ల జాతరలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివరాలు ఇవి.. **ఆలమూరు** స్థానిక కంద్రిగ పేటలో యానాదుల సంఘం ఆధ్వర్యంలో యాత్రికుల సాయంతో సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో అమ్మవారి, పోతురాజు, వినాయకుని నూతన విగ్రహాల పున:పతిష్ట ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు, పారిశ్రామికవేత్త శ్రీ మురళికష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు తదితరులు పాల్గొన్నారు. దాత ఈదల సత్యనారాయణ మూర్తి దంపతులు రూ. 50 వేలతో నూతన విగ్రహాలు సమకూర్చగా, ప్రతిష్ట నిమిత్తం అయ్యే ఖర్చులకు దాత వంటిపల్లి పాపారావు దంపతులు రూ. 50 వేలు విరాళాన్ని అందజేశారు. **మండపేట** స్థానిక 30వ వార్డు గొల్లపుంత కాలనీలోని వరాల సత్తెమ్మ తల్లి 8వ జాతర వార్షిక మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఛైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అమ్మవారిని దర్శించుకున్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంఎల్‌సి తదితరులు

విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-మండపేట

విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ గారపాటి సౌజన్య అన్నారు. ఆదివారం మెర్నిపాడులో ఎంపిపి పాఠశాల భవన నిర్మాణ పనులకు సర్పంచ్ సౌజన్య శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించడంలో భాగంగా ప్రభుత్వం కార్పొరేట్ స్కూలుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివద్ధి చేస్తోందన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణంతో పాటు కిచెన్ షెడ్డు, టాయిలెట్స్ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎనమదుల వెంకటలక్ష్మి, ముత్యాల పెద్దబ్బు, పంపన బుల్లియ్య, చల్లా మోహన్, గారపాటి ఎర్రబ్బు, గారపాటి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి వర్మ, సచివాలయ సిబ్బంది జి.రాజు, విద్య కమిటీ చైర్మన్ కప్పల రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సౌజన్య